కథానిక

# మూగనోము

"మంజుశ్రీ"

బలీయమైన కారణాలవల్ల సంవత్సరన్నరపైన అయింది శ్రీదేవినిచూసి. చదువుకునే కాలంలోనే సుఖంగా వుండటం సంభవిస్తుంది. తీయ తీయటి స్వప్నాలను కంటూ అల్లరి చిల్లరిగా, భవిష్యజ్జీవన వనంలోని పూల సౌరభాలను తలచుకుంటూ నడకసాగించవచ్చు. ఏదో అందని మ్రాని పండులా, సంసార సౌఖ్యాన్ని తలచుకుంటూ, ఆ అనుభూతులలో లీనమై పోవటంలోనే అందముంది. ఆనందముంది. బోలెడుమంది స్నేహితులు సినిమాలు, నాటకాలు, షైర్లు, వొకటేమిటి? విద్యార్థి జీవితం, పరువంలోవున్న పూలసౌరభం లాంటిది. వివాహం, జీవితగమనంలో మైలురాయి లాంటిది అన్నాడు మిత్రుడు. చదువుకునే రోజుల్లో షేక్స్పియర్ డ్రామాలలో చిరునవ్వులు చిందిస్తూ శ్రీ దేవి కనపడేది. ఇప్పుడేముంది? శ్రీదేవి నాదైంది. చదువు అయిపోయింది. హాయిగా నడచిపోతున్న నాకు, శ్రీదేవిని కూడా చెయిపట్టుకొని నడపించుక పోవాల్సిన అవసరమొచ్చింది. నిజమేమరి. ఎన్నాళ్లు వొంటరిగా నడుస్తాను? కాస్తంతతోడూ-నీడా వుండటంకూడా అవసరమేమరి. అందుకే ఒక దృష్టిలో చూస్తే నాకు వివాహం కావటం మంచిదన్న పెద్దల మాటలువిన్నవాడనై యొకానొక శుభముహూర్తంబున, బంధుమిత్రాదుల సమక్షంబున అగ్నిసాక్షిగా శ్రీ దేవిని, అర్ధాంగి స్వీకరించాను. చదువుకు వెను వెంటనే స్వస్తిచెప్పి ఉద్యోగ ప్రయత్నంలోవుండి, అటూ యిటూ తిరిగి, దొరికినది పట్టుకుని వేళ్లాడి, ఇవ్వాళ్టికి కాలూని నిలబడగలిగాను. రాత్రికాంప్ కాట్ మీద పండుకొని, విశాలయామినీ తారకలను చూస్తుండగా, శ్రీదేవి కళ్ళముందు కనపడి, కాదు కాదు నిలబడి, "బావా, ఎప్పుడు నువ్వు రావటం!" అని ప్రశ్నించినట్లయింది. ఇకవుండ బుద్ధిపుట్టలేదు. ప్రొద్దుటే సామాను సర్దేసి రైల్లోపడ్డాను. ఇంటికి వచ్చి రావటంతోనే తక్కినవన్నీ అలావుంచి "ఎన్నిరోజులు శలవపెట్టావురా" అని అడిగింది అమ్మ. "వారం రోజులిచ్చారమ్మా" అన్నాను నేను. "మరి ప్రొద్దుటే ఫస్టుబస్‌కు వెళితే తొమ్మిదన్నరా, పదింటికల్లా చేరుకుంటావు" అంది అమ్మ. ప్రొద్దుటేలేచి ప్రయాణ సన్నాహంలో వుండగా అమ్మవచ్చి, తడిగుడ్డ చుట్టిన ఓ శేరు మల్లెపూలు చేతికిచ్చి, "జాగ్రత్తరా, నలిగిపోతయి" అంది. నాకు విసుగుపుట్టింది. అవి ఎక్కడ పెట్టను? గుడ్డలు తడిఅవుతవి. పూలు వాడిపోతవి సంచిలో పెడితే. "వద్దులేవే, దారిలో అగుపడితే కొంటానులే" అన్నాను నేను చివరకెలా అయితేనేం, బ్రహ్మప్రయత్నంచేసి ఓ లేత అరిటాకు కోసుకవచ్చి, దాంట్లో పూలుపోసి దానిమీద ఓ కాయితం చుట్టి, నా సంచిలో పెట్టింది అమ్మ, చిన్నగా బ్రతిమిలాడి. కండక్టరుదగ్గర తలవంచుకుని, కార్లోసీటు సంపాదించుకున్నాను. కారు కదిలింది. కార్లో గోల ఎక్కువగావుంది. రోడ్డంట పరిగెత్తే చెట్లను, గుడ్డలను చూద్దామంటే, అవన్నీ చిన్నతనాన్నుంచీ చిరపరిచితాలునాకు, చుట్టు భరింపరాకుండా వున్నది. ఓ పక్క అరిటాకు చించి నాలుగు పూలు చేతిలో వేసికొని బ్రతుకు జీవుడా అని కూచున్నాను. ప్రయాణం చేస్తున్నప్పుడేదేనా ఆలోచలోపడితే, రాళ్లుదాటి, రప్పలు దాటి, ఊళ్లుదాటి, చివరకు గమ్యస్థానంవచ్చి పక్కవాళ్లు గుర్తుచేసేదాకా వొళ్ళు తెలీదునాకు. "శ్రీ దేవి బాగా ఏపుగా పెరిగివుండాలి. పెళ్ళి నాటికే బుజాలదగ్గరకు వుంది, ఇప్పుడెలా వుందో ఇంటిముందు సుబ్బమ్మకు కూతురట. చిన్నమరదలు చూడగానే ఏమంటుందో, చాలా గడుగ్గాయి. శ్రీదేవి మటుకు! చిన్నతనంలో శ్రీదేవీ అంతే. ఇప్పుడు మటుకు అలానే ఎగురుతూ దూకుతో వుందో ఏమో? మరి. ఏమంటుంది. రాగానే పలకరిస్తుందా. లేక పారిపోతుందా? ఏం, తనకు సిగ్గెందుకు? మామయ్యా, అత్తయ్యాసమయాని కక్కడ

లేకపోతే పాట అందుకోవచ్చు. అమ్మమ్మవుంటే ఇంకాస్త హుషారు. “ఎరుగని వారమంటే. ముఖమెరుగని వారమంటే” అనవచ్చు. ఇలా తలచుకుంటూ, తెలిసివాళ్ళు పలకరిస్తున్నా, కొందరికి సమాధానాలుచెప్పి, కొందరికి సమాధానాలు చెప్పకుండా, కొందరికి ఏవేవోచెప్పి, కొందరికి ఏమీ జెప్పకుండా, నడచిపోతున్నాను. ఆ ఊళ్ళో అదే చిక్కు, అగుపడ్డ ప్రతివాడూ, “ఏమండోయ్ చాల రోజుల కొచ్చేరు? ఏం ఉద్యోగమో? అమ్మాయి నెప్పుడు తీసుకపోతారు” ఇలా వెంటబడతారు. వాళ్ళకు మామయ్యంటే ఎంతో గౌరవం. పుట్టిపెరిగి, వీధుల్లోతిరిగి వాళ్ళందరినీ వరసలుబెట్టి పిలిచిన వాడినవటంచేసి నేనంటే ఎంతో చనువు.

వాకిట్లో అడుగుపెట్టగానే శ్రీదేవీ దివ్యమంగళ విగ్రహం సాక్షాత్కరించింది. నడవలోనిల్చొని చెల్లెల్ని పిలుస్తున్నది. నన్ను చూడగానే, కళ్యాణిని పిలవటం ఆపేసింది. అప్పటికి శ్రీదేవిని కావ్య పరిభాషలో వర్ణించాలంటే “అమందానంద కందళిత హృదయారవిందయై, ముప్పిరిగొను సంభ్రమాశ్చర్యము లుండెదమ్మున క్రందుకొన, విలాస విభ్రమ, విద్యుల్లతయై,” రాజహంసలా చక్కగా ఇంట్లోకి పోయింది. తరవాత కళ్యాణివచ్చి “అమ్మా, బావే అని” అరచుకుంటూ యింట్లోకి పోయింది. అమ్మమ్మ వచ్చి చిక్కిపోయావురా” అంది. దున్నపోతు మహారాజాలాగా వున్నా సరే, ఆమె ఆమాట అనకుండా వుండదు. కారణం ఏదో కల్పించి చెప్పనన్నా చెప్పాలి. లేక ఆమే చెప్పుకోనన్నా చెప్పుకోవాలి. లేకపోతే వదలదు. అందరూవచ్చి పలకరించారుగాని ఇక మళ్ళీ శ్రీదేవి కన్పించలేదు. అత్తయ్య నీళ్ళతోడి ఇంట్లోకి రమ్మంది. ఎలా ఎక్కడైనా, ఏ తలుపుచాటునైనా వుండేమోనని పరికించిచూశా. కళ్యాణిని అడుగుదామా అంటే, ఇంట్లోకిపోయి, అత్తయ్యతోటి “అమ్మా, అక్కయ్యేదే, బావ అడుగుతున్నాడు” అని చెబుతుంది. ఇక అమ్మమ్మ నడగాలి. ఆవిడ ఇప్పుడు ఏమీ వినిపించుకోదు. “మీ అమ్మ కొనుక్కున్న పట్టుచీర ఖరీదెంత? గొలుసు చెడగొట్టిస్తానన్నది. ఏంచేసింది? అమ్మాయికి వెండిగిన్నె కొన్నారా? దోగాడుతున్నదా? మాట్లాడుతుందా? అమ్మా, నాన్నా, తాతా, అత్తా అంటుందా” ఇట్లా వేధిస్తుంది గంటసేపు. ఇల్లుకాస్త చీకటిగా ఉంటుంది. ఎక్కడోక్కడ వుండాలి. ఎక్కడ మాయమవుతుంది. “గఱువుదీరగ నిను గాంచు తెరువులేక, తలుపుచాటున నిలిచి నేతరుణినిన్ను, నోరచూపులజూచి యుల్లూతలూచు, జిత్తమున నిన్నుజూచి యూచిగురుబోడి, పట్టజాలని సంతోష భరము చేత, నిటమాటికి నటునిటు నేగుచుండి, ముగ్ధమోహన కల్యాణమూర్తితోడ, సమయమగునెడ నీకు సాక్షాత్కరించు” అని “పింగళి–కాటూరి” వారు అన్నట్టుగా సమయంకోసం చూస్తున్నదేమో శ్రీదేవి, అయినా అంత సిగ్గెందుకు? బాగా తెలిసిన వాణ్ణేగా? ఎవరికి తెలుసు? భోజనంచేసిన తర్వాత అటూ యిటూ చూస్తుంటే, అమ్మమ్మవచ్చి, “కళ్యాణి తీసుకొస్తుంది వక్కపలుకు. నీవెళ్ళి పెద్దరుగుమీద, జీతగాడు మంచమేశాడుగాని కూచోపో” అంది. శ్రీదేవి మాత్రం కనపడలేదు.

మధ్యాహ్నం కళ్యాణివచ్చి నిద్రలేపింది. చిన్నతనంలో అది శ్రీదేవిపంతు, లోపలికివెళ్ళి కాఫీ తాగివచ్చి, కాసేపు ఏదో పుస్తకంతీసి చదువుకున్నాను. బాగా చల్లబడ్డ తరువాత మిద్దెక్కాను. భావిదగ్గర శ్రీదేవి మాచిపత్రి తుంచుతున్నది. నన్ను చూసింది. నాకు కోపమొచ్చింది. ముక్కుమీద వేలుపెట్టుకొని ముక్కు కోసేస్తానని సూచించాను. శ్రీదేవి తలవంచుకొని విరగబడి నవ్వుతున్నది. ఏయ్, అమ్మాయ్, అన్నాను. శ్రీదేవి చూడలేదు. అత్తయ్య వచ్చింది. అక్కడకు ఎందుకో. “అమ్మాయ్, కళ్యాణీ, ఇలారా, చూడు ఆవులు ఎలా వెళ్తున్నయో” గుక్కతిప్పుకోకుండా యిదంతా వొక్కపెట్టున చదివేశాను. శ్రీదేవిముఖం తిప్పిచూసింది. ఆనవ్వు చూస్తుంటే, దగ్గరుంటే రెండుచెవులూ పట్టుకొని, చెంపలురెండూ వాయించివుండే వాణ్ణి. అత్తయ్య చూడకుండా వెక్కిరించి కిందకు దిగివచ్చేశాను. కళ్యాణి బయటనిలబడి ఆవులను చూస్తున్నది. మామయ్య బయటకూచొని రాజకీయాలు దంచుతున్నాడు. పల్లెలో సాయంత్రం గంద్రగోళంగా వుంటుంది. ఎలిమెంటరీ స్కూలు విడవగానే పరుగెత్తుకుంటూ గోలగోలగా అరుస్తూ వస్తుంటారు

పిల్లలు. ఆవులువచ్చేవేళ కనిపెట్టి, లేగలు కొట్టాల్లోంచి, లేకపోతే విడిస్తే వీధుల్లోకివచ్చి అంబా, అని అరుస్తూ వుంటాయి. ఎక్కడ వింటుందో మరి ఫర్లాంగుదూరంనుంచి ఆవు మళ్ళా అంబా అంటుంది. ఇలా వొకరినొకరు కలుసుకునేదాకా తల్లులూ, పిల్లలూ అరుస్తునే వుంటవి. మేకల మందలు తోలుకపోతుంటారు కొందరు. గడ్డి మోపులు తెస్తుంటారు కొందరు. సాయంత్రం చాలా సందడిగా వుంటుంది పల్లెల్లో. ప్రొద్దుగూకిన తర్వాత వోగంటమటుకే యీ సందడి. తరువాత ఎక్కడదక్కడ చప్పబడిపోతుంది, ఏదేనా వీధి భాగవతమో హరికథా కాలక్షేపమో వుంటేతప్ప.

చిన్నప్పుడు ఆడుకున్న ఆంజనేయస్వామివారి ఆలయం చూసిరావాలని బుద్ధిపుట్టింది. కళ్యాణిని చెయిపట్టుకొని గుడికి వెళ్ళాను. అర్చకుడు బాగా తెలిసినవాడే. చిన్నతనంలో యెత్తుకొని తిప్పాడు నన్ను. కాస్తంతదూరంలో శివాలయం వున్నది. కళ్యాణిని నడిపించుకొని శివాలయానికి వెళ్ళాను. పచ్చగన్నేరు చెట్టు ముసలిదైంది. చెట్టెక్కి పూలు రాలుస్తుంటే కింద నిల్చొని శ్రీదేవి ఏరేది. అవన్నీ చూస్తుంటే చెప్పలేని దిగులు గలిగింది నాకు. జీవితమెంత క్షణికం! అప్పుడే శ్రీదేవీ, నేనూ ఎన్నో యవస్థాభేధాలను దాటివచ్చాము. ఇక మళ్ళీ ఆ ఆనంద జీవితం పొందలేము.

భోజనాలుచేస్తుండగా మామయ్య అడిగాడు కళ్యాణిని, "ఏమమ్మా! బావా నీవూ కలసి ఎక్కడ కెళ్లారు?" కళ్యాణి వినిపించుకోకండా "అక్కయ్య రాలేదు నాన్నా! ఎంత తీయగావున్నాయోతీర్థం, పానకం యిస్తుంటే బావ వద్దన్నాడు నేను తాగేశాను. అక్కయ్యకూడా తాగేదే"అంది. అందరూ నవ్వుకున్నారు. ఎక్కడనో నిల్చొని శ్రీదేవికూడా నవ్వుతూవుంటుంది. అయినా ఏమిటీ యీ మూగ మంత్రం? ఇలా మూగదైపోయింది. వాగివాగి నా దుంపతెంచేది. ఇప్పుడు వులుకూ పలుకూ ఏదీ లేకుండా కంటికక్కూడా కనపడకుండా దాక్కుంటున్నది. రేపెప్పుడైనా అవపడకపోతుందీ? మాటాడకపోతే ఊరికెళతానంటే సరి. మంత్రం పారుతుంది. ఇలా ఆలోచించుకుంటున్నాను. చాల నలేదుకాబోలు అన్నానికి మూడింతలు పెరుగు వడ్డించిపోయింది అత్తయ్య. శ్రీదేవి అయితే పిసరంత వడ్డించిపొయ్యేది మళ్ళీ పిలిపించుకోవాలని. కళ్యాణి మూతినిండా పూసుకుంటున్నది పెరుగు.

మర్రోజు ప్రొద్దుటే కాఫీత్రాగి ఏదో పుస్తకం చదువుకుంటూ కూచున్నాను. శ్రీదేవి, కళ్యాణి చేయిపట్టుకొని, రెండోచేతిలో చిట్టుబొట్టు గిన్నె పట్టుకొని వెళుతున్నది నా ముందునుంచే. పుస్తకంలోంచి తలయెత్తి చూశాను. "మాట్లాడకూడదు బావా"అంది కళ్యాణి. నిజమే—గుర్తొచ్చింది. చిట్టుబొట్టు నోముపట్టేవాళ్లు గిన్నెతీసుకుని ముత్తైదువులకు బొట్టుపెట్టివచ్చేదాకా మాటాడకూడదు. శ్రీదేవి నాతట్టు చూసి నవ్వింది. న్యాయంగా మాట్లాడితే, యివాళ శ్రీదేవి వ్రతం చెల్లదు. ఆ నవ్వులో ఎంతో గ్రంథం మాటాడింది. మూగ నోము ఎలా అయిపోతుంది మరి! వాళ్లు వెళ్ళిపోయారు. నా హృదయం చెప్పలేని ఆనందంతో నిండిపోయింది. ఏమిటో విచిత్రమైన అనుభూతిని పొందాను. శ్రీదేవి ఆ వ్రతం నాకోసం, నన్ను గురించి చేస్తున్నది. అలా తలచుకునేటప్పటికి దేహం మొత్తం పులకరించిపోయింది. అందుకనే విశ్వనాథవారు "కమ్మని పాలబుగ్గవవుగా! పతికోసమ యిన్ని నోములన్ కిమ్మనకుండ నోచెదవు" అన్నారని అనుకున్నాను. శ్రీదేవి నా హృదయేశ్వరి, నాదేవి. "భవన్నియమ ప్రభావ వసంధనము చేత నీ పతిసుధామయమూర్తి సముజ్జ్వలించెడున్" అని శ్రీదేవిని పెద్దలాశీర్వదిస్తున్నట్లుగా తలచుకొని అర్ధనిమీలితుడనై పోయాను.

మధ్యాహ్నంపూట శరత్‌బాబు శ్రీకాంత తీసి చదువుకుంటున్నాను. శరత్‌బాబు శ్రీకాంత నేను ఎన్నిమాట్లు చదివానో లెక్కలేదు. తోచనప్పుడల్లా చదువుతూనే వుంటాను. పెళ్ళయిన తర్వాత శ్రీదేవికి కొన్ని శరత్‌నవలలు కొనియిచ్చాను. అవి చదివిందో చదవలేదో మరి. అలా చదువుకుంటుంటే కళ్యాణివచ్చి చెయిపట్టుకొని "అక్కతెమ్మంటున్నది, యిలాతే దీన్ని" అన్నది.

"మీ అక్కనొచ్చి తీసుక పొమ్మను కావాల్సుంటే" అన్నాను నేను. మామయ్య నిద్రపోతున్నాడు. అత్తయ్యా అమ్మమ్మా ఏదో ఫలహారం చేయటంలో మునిగిపోయారు. కళ్యాణి యింట్లోకి వెళ్ళిపోయింది. శ్రీదేవి గోడకున్న కిటికీదగ్గరకొచ్చి

తీసుకో కళ్యాణీ' అన్నది. తలఎత్తి చూశాను. శ్రీదేవి నిలుచుని వున్నది.

శ్రీ! పుస్తకం కావాలా?

శ్రీదేవి తల కిందికీ పైకి ఆడించింది.

ఏం? మాట్లాడవు?

............

చెప్పదుకూడానా...హరిభగవంతుడా...

శ్రీదేవి గలగలనవ్వింది.

ఇలావచ్చి తీసుకపో, అన్నాను చూపిస్తూ.

"రాకూడదు," అంది శ్రీదేవి.

ఎందుకు?

సంప్రదాయం.

ఎవరన్నారు?

పెద్దలు.

శ్రీదేవికి నేనేం సమాధానం చెబుతాను? మామయ్య లేస్తాడేమోనని భయం.

మరి మొన్న మొన్నటిదాకా, అంటే, నువ్వు చిన్నదానివిగా నున్నప్పుడు, ఎదుటికిరావటం అలా వుంచి, వెనకనుంచి బుజాలమీద చేతులేసి ఉయ్యాలలూగే దానివి. ఒకసారి అరుగుమీద అలా చేస్తుంటే పడిపోతావని మామయ్య కోప్పడ లేదా? అత్తయ్య రెండు అంటించలే—

శ్రీదేవి నవ్వింది. శ్రీదేవికి నవ్వటంతప్ప ఏమీ చేతగావేమో ననిపిస్తుంది వొక్కొక్కసారి నాకు.

శ్రీదేవిఅంది. "ఇప్పుడు ఊగననుకుంటున్నారు కాబోలు. ఇకముందు ముందునుంచి చేతులువేసి.. చప్పున నాకొకటి గుర్తుకొచ్చింది. (శ్రీకాంత్ బాబుని రాజలక్ష్మి ఓసారి యిలానే అంటుంది.) ఆ మాటలని శ్రీదేవి నవ్వుతున్నది. ఏమంటారు? వొప్పుకుంటారా? విసిరి అవతలెయ్యరుగదా! (ఇవి రాజలక్ష్మి మాటలే మరి!)

"సరేగాని, ఇదెప్పటినుంచి?"

"ఏది?"

"బహువచనం."

"అంటే?"

"మీరు, మీరు, అని! తెలిసిందా?"

"అప్పటినుంచే. ఆవాళ మీ చేతులతో..."

శ్రీదేవి మంగళసూత్రం చూసుకుంది.

శ్రీదేవికి నేను లోలోపల శతకోటి ఆశీర్వాదాలు సమర్పించివుంటాను.

"అలా అయితే నేను పలకను."

"మీరు పలక్కపోతే నేను వులకను."

మళ్ళీ అదే...

ఇంతలోకే అమ్మవచ్చింది.

"ఏమిటిరోయ్! ఊరికెళ్ళిన తర్వాత కొత్త సంసారంగురించి, ఇల్లూ సామానూగురించి మాటా కుంటున్నారా? నా తల్లే!" శ్రీదేవి వెళ్ళిపోయింది. మళ్ళీ ఎప్పుడెప్పుడుపడుతుందో, ఎప్పుడు మాటాడు తుందో. అమ్మమ్మ.....అబ్బ.....అనుకున్నాను.

మూడోరోజు సాయంత్రం మిద్దెమీద కూచొనిచూస్తున్నాను కల్యాణిని తీసుకొని శ్రీదేవి వచ్చింది.

'శ్రీ' ఇలారా, ఇక రెండురోజులలో వూరికెళ తాను తెలుసా? శ్రీదేవి దగ్గరకొచ్చి కూచుంది. గవాక్షిదగ్గర గిల్లాల నేరుకోవటానికి కళ్యాణి వెళ్ళి పోయింది.

అప్పుడే సెలవైపోయిందా, అంది శ్రీదేవి.

ఆహా, మూడురోజులదాకా మాట్లాడటానికి తీరికలేకపోయిందిగా తమకు?

మాట్లాడాలసినవన్నీ ఇప్పుడు మాట్లాడండి వింటాను.

అండి ఏమిటి? భాండిలాగ... నాకలాపిలిస్తే బాగుండదు.

శ్రీదేవి మాట్లాడలేదు. నవ్వి వూరుకుంది.

శ్రీదేవిని దగ్గరగా లాక్కున్నాను.

ఎప్పుడు తీసికెళతారు? కువకువలాడింది.

రాణీగారు 'ఊ' అంటేచాలు రేపు నాతోటే తీసుకపోతా.

రేపెలా వస్తాను! రాణిగారు ఎలాబడితే అలా బయలుదేరరు.

అయితే రాణివాసపుపల్లకీపంపిస్తాను. కదలిరండి.

"శీదూ"—క్రిందనుంచి పిలుపు వినపడ్డది.

కళ్యాణిని తీసుకొని శ్రీదేవి వెళ్ళిపోయింది.

ఊరినుంచి వచ్చేరోజున, బండి ఎక్కుతుండగా శ్రీదేవి కళ్యాణి చేయిబట్టుకొని, రెండో చేతిలో చిట్టిబొట్టు పెట్టుకొని, వాకిట్లో నిలబడ్డది.

వస్తాను శ్రీ అన్నాను నేను.

"మాట్లాడకూడదు బావా" అంది కళ్యాణి వేలు చూపిస్తూ.

"ఓహో, మూగనోము కాబోలు;మూగనోము!"